చాలా మందికి చాలా చాలా ఎలర్జీ. ఈ ఎలర్జీ అనేది ఎందుకొస్తుందో ఎవరూ చెప్పలేరు. మహా మహా మేధావులనడిగినా దీనికి సరిఅయిన సమాధానం రాదు. ఈ ప్రశ్న వాళ్ళకి ఎలర్జీ, సరి అయిన కారణం చెప్పలేరు కాబట్టి.

శంకరంకి పట్టుమని పదేళ్ళు లేవు. వాడికి ఎలర్జీ. ఆ ఎలర్జీ అన్నది తినేతిండివల్ల, పీల్చే గాలివల్ల వాడికిరాలేదు. సోడాబుడ్డి కళ్ళద్దాలు. ఆ వస్తువుని చూస్తే శంకరానికి చెప్పలేనంత ఎలర్జీ.

శంకరంనాన్నగారికి సోడాబుడ్డి కళ్ళద్దాలు వున్నాయి. శంకరానికి చదువు చెప్పే పిలక మేష్టారికి సోడాబుడ్డి కళ్ళద్దాలు వున్నాయి. వీటి వెనుకో కథ వుంది.

శంకరాన్ని క్రమశిక్షణతో పెంచటం తండ్రిగా తన ప్రథమ కర్తవ్యం అని తలచిన శంకరం తండ్రి పరంధామయ్య క్రమశిక్షణ అనే పేరుతో శంకరాన్ని రాచి రంపాన పెట్టేవాడు. సోడాబుడ్డి కళ్ళద్దాలలోంచి మిర్రి మిర్రి చూసేవాడు. ఆ చూపులే నచ్చేవి కావు శంకరానికి. అలాగే పిలక మేష్టారు విషయం కూడా. పిలకమేష్టారు కళ్ళద్దాలయితే కళ్ళకుండేవి కావు. ముక్కు మీదికి జారి ముక్కుకి కళ్ళజోడు అవసరం అనేట్లు వుండేవి. దానికితోడు ఆయనది బుర్ర ముక్కు. దానికి దొండకాయ దోపేటంత కంతలు. ఆ కంతల నిండుగా కూరి కూరి నింపినట్లు పొపుడిలో నశ్యం. ముక్కుమీదికి జారిన సోడాబుడ్డి కళ్ళద్దాల్లోంచి చూడాలంటే ఆయన కళ్ళద్దాలు సరిజేసుకునేవాడు కాదు. ముక్కుమీదనే జోడుంచుకుని తలవాల్చి చూపులు పైకెత్తి విచిత్రంగా అద్దాలలోంచి ఎదుటివాళ్ళని చూసేవాడు. ఆ చూపులు ఎవరో్కవాలంటే. ఆ ముక్కుని చూడక తప్పదు. ముక్కునిండా నిలవున్న నశ్యాన్ని చూడకతప్పదు ఇదంతా చూడలేక ఏదైనా ప్రశ్న మాష్టారు అడిగినప్పుడు శంకరం తలొంచుకుని జవాబిచ్చేవాడు

"ఏంరా! నా ముఖంలో కోతులేమైనా ఆడుతున్నాయా! లేక నాముఖంచూస్తే కోటి పాపాలు అంటుకుంటాయా! పింజారి ఎదవ పింజారిఎదవా అని ముందు తలెత్తి తిన్నగా నా ముఖంలోకి చూసి సమాధానం చెప్పు" బెత్తం గాలిలో వూపుతూ గదమాయించేవాడు.

ముక్కుమీదుండే సోడాబుడ్డి కళ్ళద్దాలు. దాన్ని మోస్తూ బుర్రముక్కు. మాయా గుహల్లాంటి పెద్దకంతలు. ఆ రెండు కంతల నిండుగా బుట్టెడు ధూళి. అమ్మ బాబోయ్- అనుకుంటూ శంకరం అతి కష్టంమీద కను రెప్పలు ఎత్తి చూసేవాడు తలఎత్తకుండానే. కాని అదేమిటో అసంకల్పిత ప్రతీకార చర్యలా తక్షణమే ఆ రెప్పలు మళ్ళీ వాలిపోయేవి. దాంతో శంకరం దొంగవేషాలేస్తున్నాడని. మొండి వెధవని. అదని ఇదని చాలా ఆలోచనలురాగా. "తలెత్తి నాముఖంలోకి చూడరా తిక్కనా....కా! నా మాటలంటే నీకంత వేళాకోళంగా వుందా? పింజారి నా...." అలా మాటలు రంకెల్లా వదులుతూ బెత్తానికి పని కల్పించేవాడు. పంతులయ్య చేతిలో బెత్తం పిల్లలవీపుమీద భరతనాట్యం ఆడటానికే పుట్టింది అన్నట్లు.

సోడాబుడ్డి కళ్ళద్దాల్లోంచి మిర్రి మిర్రి చూసే తండ్రి చూపులు. బుర్రముక్కు ఆ అద్దాలని భరించి చూస్తున్నదన్న చూపులతో మాష్టారు ఈ రెండూ ఎలర్జీ అయి దానాదీనా శంకరానికి. తండ్రినాన్న మాష్టారు అన్నా ఎలర్జీగాక కేవలం-కేవలం సోడాబుడ్డికళ్ళద్దాలంటేనే ఎలర్జీ వచ్చేసింది.

శంకరంకి తొమ్మిదోఏడు. బడిలో చివరి బెంచీలో స్థానం వాడిది. కళ్ళు చికిలించి చూసినా, కళ్ళు విప్పార్చిచూసినా ఎలా చూసినా సరే నల్లబోర్డు కనిపించేది గాని నల్లబోర్డుమీదవున్న తాటికాయంతేసి చాక్‌పీసుతో గీసిన తెల్లని అక్షరాలు కనిపించేవి కావు. బోర్డ్ దూరం అయి కనిపించటం లేదనుకుని పక్కపిల్లాడి నడిగితే "అదేంటిరా! నీకు కళ్ళు కనిపించటంలేదా! అక్షరాలు ఇంచక్క కనిపిస్తుంటే నన్నడుగుతావేమిటి? కళ్ళజోడు పెట్టుకోవోయ్." అన్నాడు. అంతే! మరెప్పుడూ శంకరం పక్క పిల్లాడిని అడగలేదు. కడుపులో నొప్పి అన్నా. కాలు నెప్పిఅన్నా "బడి ఎగ్గొట్టడానికి వెధవ్వేషాలు" అని తిట్టే తండ్రి కావటంతో ఈ విషయం చనువుగా తండ్రితో చెప్పలేకపోయాడు.

"మీ అబ్బాయి బాగా చదువుకోటం లేదు. చెప్పిన పాఠం వినిపించుకోడు. బోర్డు మీద రాతలు లెక్కలు ఎక్కించుకోటం లేదు దేనికీ సమాధానం చెప్పడు. మొండి కెత్తిపోయాడు మీ ఇష్టం". అని మాష్టరుగారు రాసిన లెటర్ పట్టుకువచ్చి శంకరం తండ్రికి బుద్ధిగా యిచ్చాడు. దాని ఫలితం శంకరం తాటలేచిపోయింది. ముక్క చివాట్లు అన్నీ అయిపోయింతర్వాత శంకరం


## ఛాయాచిత్ర


### గ్రామీణ, నగర జీవిత (ఛాయా) చిత్రణ

గ్రామీణ జీవితం నగర జీవితానికి పూర్తిగా భిన్నం. గ్రామం తల్లి అయితే నగరం ప్రేయసి. తెలుగు గ్రామీణ జీవిత సౌందర్యాన్ని ప్రతిబింబించే ఛాయాచిత్రాలను అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్ల నుంచి ఆహ్వానిస్తున్నాము. అలాగే నగర జీవితాన్ని విశ్లేషించే ఛాయాచిత్రాలను కూడా అమెచ్యూర్ ఫొటోగ్రాఫర్ల నుంచి ఆహ్వానిస్తున్నాము. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంపాదకవర్గం ఎన్నికచేసే ఉత్తమ ఛాయాచిత్రాలను వరుసగా ప్రకటించి నగదు బహుమతులతో సత్కరిస్తాము. ఫొటోలు పంపవలసిన ఆఖరు తేదీ 31 మార్చి 1984.

ఫొటోగ్రాఫర్లు తమ ఫొటోలను తగు తిరుగు తపాలాబిళ్ళలను చేర్చి, స్వంత చిరునామాకల కవర్లను జతచేసి పంపాలి.

ఫొటోలను పోటీకి పంపవలసిన చిరునామా:
'ఛాయాచిత్ర'
c/o ఎడిటర్.
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక.
పోస్ట్‌బాక్సు నెం. 712. విజయవాడ-520 010

—ఎడిటర్



# సోడాబుడ్డి కళ్ళద్దాలు

కురుమద్దాలి విజయలక్ష్మి

పదేపదే చెప్పింది వాళ్ళ నాన్న బుర్ర కెక్కింది.

విషయం అర్థం అయింతర్వాత కళ్ళ డాక్టరు దగ్గరకు శంకరాన్ని తీసికెళ్ళి చూపించటం. డాక్టరుగారు పరీక్షచేసి "మయోపియా" అని చెప్పారు. విడవకుండా కళ్ళజోడు వాడాలని, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పారు. ఫలితం ఏ సోడాబుడ్డి కళ్ళద్దాలంటే శంకరంకి ఎలర్జీయో ఆ సోడాబుడ్డి కళ్ళజోడుని తొమ్మిదో ఏడు నిండకముందే శంకరం తన కళ్ళకి అలంకరించక తప్పలేదు.

శంకరం కళ్ళు అబ్బిపప్పల్లా. పెద్దవిగా. అందంగా వుంటాయి. ఆ కళ్ళకి జోడు రావటంతో సోడాబుడ్డి అద్దాల్లోంచి శంకరం కళ్ళు విచిత్రంగా కాస్త వికారంగా చూపరులకి కానవచ్చేవి. ఇదేమాట శంకరం స్నేహితులు శంకరంతో అనటం జరిగింది.

దగ్గరదూరం అన్ని అక్షరాలు చాలా చక్కగా కనపడుతున్నాయి. కాని.... కాని.... మనసు చంపుకుని సోడాబుడ్డి కళ్ళద్దాలు ధరించక భరించక తప్పలేదు. "జోడుంటే నీముఖం బాగుండలేదురా! ఇంత చిన్న వయసులో యింత మందపాటి అద్దాలా! జోడు తీస్తే కనపడవా? ఎలా అయినా కళ్ళకి అద్దాలుంటే కష్టంరా. పరుగెత్తాలన్నా ఆడుకోవాలన్నా ఎగిరి దూకాలన్నా —ప్చ్.... పాపం...." ఇలా చాలా మాటలుపడ్డాడు శంకరం. దీనికితోడు డాక్టరుగారు సవాలక్ష జాగ్రత్తలు చెప్పాడు. "ఎగిరిదూకటం. పరుగెత్తటం చేయకు. నిద్రపోయేటప్పుడు తప్ప మిగతా సమయాలు కళ్ళజోడు తప్పక పెట్టుకోవాలి. ఇప్పుడిది నీ శరీరంలో భాగం. సినిమాలు ఎక్కువ చూడకు. పిచ్చి పిచ్చి (కథలు) పుస్తకాలు చదువుతూ కళ్ళకి అలసట కలిగించకు బాగా ఆకుకూరలు తిను. కేరెట్ తిను.... అది యిది...." అంటూ ఓ లిస్టు చదివాడు.

బడిలో ముగ్గురి పేర్లు శంకర్రావులే. ఇప్పుడు తికమకపడకుండా స్నేహితులు శంకరంని కళ్ళజోడు శంకరం అనటం మొదలుపెట్టారు. తండ్రి కళ్ళజోడులోంచి మిర్రి మిర్రి చూడటం. మాష్టరు గారి ముక్కు కళ్ళజోడు యివన్నీ యిప్పుడు శంకరం తన కళ్ళజోడు అద్దాలలోంచి స్పష్టంగా చూస్తున్నాడు.

తన కళ్ళకి సోడాబుడ్డి కళ్ళద్దాలు వచ్చినప్పుడు చాలారోజులు చాటుగా ఏడ్చాడు శంకరం. ఆ జోడుని రాయిపెట్టి పప్పు పప్పుగా చితకకొట్టాలనిపించేది. కాని ఎవరెంత వెక్కిరింత వేళాకోళం చేసినా. తనకి ఎలర్జీ అయినా ఆజోడు ధరిస్తే కళ్ళు చక్కగా కనిపించేవి. అందుకు.. కేవలం అందుకు అవమానం భరించి దిగులుని దిగమింగి సోడాబుడ్డి కళ్ళద్దాలని కళ్ళకి తగిలించుకునేవాడు.

కళ్ళజోడు వచ్చినప్పటినుంచీ శంకరం పూర్తిగా మారిపోయాడు. అంతకుముందు తూనీగలా లేడిలా వుండేవాడు. మన్నుతిన్న పాములా స్తబ్దుగా వుంటున్నాడు యిప్పుడు. 'పాపం చేసుకుంటే. వాళ్ళకి మాత్రమే కళ్ళజోడు వస్తుంది. కళ్ళజోడు విడవకుండా పెట్టుకోటం శిక్ష.' ఇలా పిచ్చిపిచ్చి ఆలోచనలు చేసేవాడు. ఈ ఆలోచనల వెనుక మరో బలమైన కారణం కూడా వుంది. తోటి పిల్లల హేళనవరకూ ఫరవాలేదు. కాని.... "కళ్ళజోడుకి డబ్బుపోసి కొనిచావాలి. కింద పడి విరిగిందా చావగొడతాను. జాగ్రత్తగా వాడు. నలభై ఏళ్ళ తర్వాతగాని నాకు కళ్ళజోడు అవసరం రాలేదు. పట్టుమని పదేళ్ళు లేవు ఇప్పటినుంచే నీ ముఖానికి కళ్ళజోడు. నాకు డబ్బుఖర్చు!" అని మధ్య మధ్య తండ్రి దీవెనలు. మరోపక్క "నాకన్నా లావు అద్దాలురోయ్! ఏంరా! నాలుగుకళ్ళతో చదువుతున్నావు చూస్తున్నావు. పాఠం తప్పు. లెక్కలు తప్పు. పింజారి వెధవ. నీ బుద్ధికి కూడా ఓ జోడుండాలిరా!" అనే మాష్టారు గారి పలుకులు- ఇవన్నీ శంకరం హృదయాన్ని ఎంతో గాయపరిచాయి. పుండుమీద పుల్లపెట్టి గిలికి

## మందార మకరందాలు

### బ్రతుకు బాటకు వెతుకులాట

"కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ఇతీహా(క్రు)శ్యతే లోకైః కాలే కాలే యుగే యుగే"

"నేడు లోకంలో గుణవంతుడూ, వీర్యవంతుడూ ఎవడు?" అంటూ లోకులు ప్రతి కాలంలోనూ, ప్రతి యుగంలోనూ ఆక్రోశిస్తూనే ఉన్నారు.

"చేతః ప్రకృష్టం యేషామి త్యేవం జ్ఞేయాః ప్రచేతసః ।
తేషా మపత్యత్వేనేమే సంతి ప్రాచేతసాః సదా ॥"

చేతము ప్రకృష్టముగా గలవారు ప్రచేతసులు. అట్టివారి బిడ్డలుగా (ప్రకృష్ట చిత్తత్వము జీవలక్షణముగాగల) ప్రాచేతసులు ఎల్లప్పుడూ ఉన్నారు.

"దుర్వర్ణైః స్వర్ణసంకాశైః ఇంద్రియార్థై రపోహితాః ।
ఆసురీం ప్రకృతింగత్వా లోలుభ్యంతే నరాః క్షితౌ ॥"

బంగారంలా మెరిసే తప్పుడు రూపు ఇంద్రియ విషయాలచే పెడదారి పట్టించబడి రాక్షస స్వభావం పొంది నరులు లోకంలో ఆశ పెట్టుబడుతున్నారు.

"అతో వ్రతమనుష్ఠేయం పాపవైభవ వర్జితమ్ ।
ప్రోక్తం మహాత్మభిర్జ్ఞానం అనసక్త్యా సుఖమిచ్ఛుభిః ॥"

కనుకనే పాప వైభవాలను విడనాడి ఆర్జవంతో బ్రతికే వ్రతాన్ని ఆచరించాలి. సుఖములను అనాసక్తులై అనుభవించగోరాలి అనే సూత్రం ఆధారంగా చేసుకొన్న మహాత్ములు ఈ వ్రతాన్ని ప్రవచించారు.

"చికిత్సా విధిరాదిష్టో మహా భాగవతోక్తితః ।
అసతః శ్రమదాంధస్య దారిద్ర్యం పరమంజనమ్ ॥"

దొంగ వైభవాలకై వెర్రెత్తిన వారికి చికిత్సా విధానం మహాభాగవతం చెప్పింది. "డబ్బు మదంతో కళ్ళు మూసుకుపోయిన దుర్జనునకు చూపును ప్రసాదించగల గొప్ప కాటుక— దారిద్ర్యము".


—సౌభరి

నట్లు కళ్ళజోడు భరించే బాధేగాక దాని తాలూకు మాటలు కూడా పడాల్సివచ్చేవి.

సహనవంతులకే పరీక్షలు. దెబ్బతగిలిన వేలికే మళ్ళీ మళ్ళీ దెబ్బతగలటం సహజ లక్షణం. శంకరం పెరిగి పెద్ద అవుతున్నాడు. సహనంగా ఎదురుదెబ్బలు తింటున్నాడు అలా పెరిగిన శంకరం సాటి వాళ్ళ దృష్టిలో సాధుజీవిగా మెతకవాడిగా తయారయాడు.

కళ్ళద్దాల పవరు పెరిగి అద్దాలు పెద్దవయాయి మందంతో. చదువు పూర్తయి ఉద్యోగం కూడా వచ్చింది. ఇక కావాల్సింది పెళ్ళివక్కటే. ఇప్పుడు శంకరం పెళ్ళిచూపులకు వెళ్ళవస్తున్నాడు. పెళ్ళి చూపులప్పుడు సోడాబుడ్డి కళ్ళద్దాలలోంచి పెళ్ళికూతురిని శల్యపరీక్షచేసి చూసి చివరికి తిరస్కరిస్తున్నాడు. శంకరం ప్రవర్తన అంతులేని చికాకుకలిగించేది తండ్రికి.

"ప్రతి సంబంధానికీ నీకో వంక దొరుకుతున్నది. అసలు నీ మనసులో ఏముందో చెప్పరా? ఎవరినన్నా ప్రేమించావా! ఆ.... నీ ముఖం! నీవు ప్రేమించినా నిన్ను




ప్రేమించగల పిల్ల అసలు వుందా అని— అహా వుందా అని....!" వరంధామయ్య చిందులుతొక్కుతూ అన్నాడు.

ఆ క్రితం రోజు శంకరానికి ఓ పిల్లని చూసి వచ్చారు. రూపగుణ లావణ్యాలకి తోడు పిల్లకి భారీకట్నం మరో అర్హతగా కూడా వుంది అయినా శంకరం ఆ పిల్లని చేసుకోను పొమ్మన్నాడు. దాంతో వరంధామయ్య చిందులు శివాలు తొక్కాడు.

అప్పుడే విషయం బైటపెట్టితే ఏచిక్కూ వుండేదికాదు. మరికొన్నాళ్ళాగి మరికొన్ని సంబంధాలు చూసి వదిలేసిం తరువాత శంకరం చావుకబురు చల్లగా చెప్పాడు.

"నాన్నా! కళ్ళజోడు అనేది కళ్ళకున్న సహజ సౌందర్యాన్ని కప్పేస్తుంది. పైగా అర్ధఅంధత్వాన్ని ముఖాన అంటించినట్లు తెలియజేస్తుంది. పల్లెటూరి వాళ్ళకి, పనిపాటలు చేసుకునేవారికి ఫరవాలేదు గాని చదువుకునే వారికి, ఉద్యోగాలు చేసేవారికి కళ్ళజోడు ఎన్నో విధాల ఇబ్బంది. మగవాడిని నాకే యిలావుంటే ఆడపిల్లకి కళ్ళజోడువుండటం ఎంత దురదృష్టం! కన్నువంకర కాలు వంకర లేకపోయినా ఓ పెళ్ళి కావాల్సిన ఆడపిల్లకి కళ్ళజోడు వుంటే ఈ జన్మకి ఆడపిల్లకి పెళ్ళిఅవుతుందా? అందుకే ... అందుకే నే పెళ్ళంటూ చేసుకుంటే కళ్ళజోడు వున్న అమ్మాయినే చేసుకుంటాను. ఇన్ని సంబంధాలు చూశాను గాని వక్క పిల్లకీ కళ్ళజోడు లేదు."

ఈ మాటలు వినంగానే వరంధామయ్యకి పిచ్చి పట్టటం వక్కటే తక్కువయింది. "ఓరి భ్రష్టుడా! యిదేం కోరికరా! నీ ఆదర్శం మండినట్లేవుంది. మరో నలభై ఏళ్ళతర్వాత నూటికి వకరికి మాత్రమే కళ్ళజోడు వుండదని సైన్సు చెపుతున్నదని ఓ శాస్త్రజ్ఞుడి మాట. ఆమధ్య ఏదో పేపరులో వేశారు—వచ్చేదెలాగూ అందుల యుగమే. వాళ్ళందరి మీద జాలితలిచి అసలు పెళ్ళాడను పొమ్మనలేదు. గంతకు తగ్గ బొంత కావాలని మాత్రమే కోరుకుంటున్నావు. ఈ కరువు రోజుల్లో నాలుగువేళ్ళు లోపలికి పోయేవారికి మాత్రమే రోజులు అంతంత మాత్రంగా వుంటే నీకు గాక నీ భార్యకు కూడా కళ్ళజోడు వుండాలా? నీ కళ్ళజోడుకి డబ్బులు,వచ్చే పిల్లదాని కళ్ళజోడుకి డబ్బులు—నీ సంపాదన జోళ్ళకే సరిపోతే నీవు తినేది ఏమిటంట— పగిలిన అద్దం ముక్కలా? విరిగిన కళ్ళజోడు ఫ్రేమా?"

కల్లుతాగి నిప్పుతొక్కిన కోతిలా వరంధామయ్య మారాడు. ఆరోజు మొదలు కొత్త విషయం తన సాధింపులో చేర్చాడు. ఈ సుత్తి దెబ్బలతో తలవాయగా చాలా

## ఉగాది కార్టూన్ల పోటీ

తెలుగుదేశం పరిపాలనపై వ్యంగ్య హాస్యపూరితమైన చక్కని కార్టూన్లను తెలుగు కార్టూనిస్టుల నుంచి ఆహ్వానిస్తున్నాము. వివర్శాత్మకంగా, నిస్సంకోచంగా తమతమ అభిప్రాయాలను ప్రతిభావంతంగా కార్టూనిస్టులు వ్యక్తం చేస్తారని ఆశిస్తున్నాము

(మంచి కార్టూనుకు మంచి బహుమతి)

మీ కార్టూనను— ఉగాది కార్టూన్ల పోటీ, C/O ఎడిటర్, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, పోస్టు బాక్సు నెం 712, విజయవాడ-520 010కి పంపించాలి.

—ఎడిటర్

సంబంధాలను చూసి చివరికి విసిగి తండ్రి మాటకి తల వంచాడు శంకరం.

కళ్ళజోడులేని కామాక్షి కళ్ళజోడు శంకరం భార్య అయింది.

శోభనంనాడు శంకరం పాదాలని బంకలాగా పట్టుకుని భోరుమంది కామాక్షి. సినిమాలలో చూశాడు. కథల్లో చదివాడు. దేంట్లోనూ శోభనంనాడు అమ్మాయిలు భోరుమనరు. సిగ్గులాంటిది పడతారు గాని తెలుగు సినిమాలలో అయితే పాటలు కూడా పాడతారు. అది వేరే విషయం.

"ఎందుకేడుస్తున్నావ్? ఏమయింది" కంగారుగా అడిగాడు.

"క." అని, ఆపై "క అ అ...." అంటూ ఏడ్పు మొదలుపెట్టింది కామాక్షి.

శంకరం ప్రాణాలు పైనే పోయాయి. ఆయుష్షు వుండబట్టి బతికాడు. కళ్ళజోడు అబ్బాయిని పెళ్ళాడటం కామాక్షికి యిష్టం లేదేమో? పెద్దలు బలవంతంగా కామాక్షి మెడ (లు) వంచి పెళ్ళిచేసి వుంటారు. "కళ్ళజోడు...." అంటూ ఖిన్నవదనుడై నాన్నాడు శంకరం.

"ఊ....ఊ ...కళ్ళజోడే. మోసగించి, బలవంతానా!" మళ్ళీ ఎక్కిళ్ళు పెట్టింది కామాక్షి.

"నాకు అర్థమైంది. ఇలా జరుగుతుందని పగటికలలో కూడా నేను అనుకోలేదు. ఈ పెద్దలకి బుద్ధిలేదు. కళ్ళజోడున్న అమ్మాయిని చేసుకోవాలన్న కోరికని మా నాన్న కాదని నా మెడలొంచాడు. భరకి కళ్ళజోడు వుండటం యిష్టంలేని నీ మెడలు మీ వాళ్ళు వంచారు. నీవు విచారించకు కళ్ళజోడు లేనివాణ్ణి నీకిష్టమైన వాణ్ణి నుల్లోకాల్లో గాలించి...."

"అది కాదు...."

"అడ్డు రాకు కామాక్షీ! ఇప్పుడు నాకు ధైర్యం వచ్చింది. ఈ స్వార్థపరులైన పెద్దలమాటలు యింక నే లెక్కచేయను."

ఇరువురూ కొద్దిసేపు కిందా మీదా (మాటల్లో మాత్రమే) పడిం తరువాత కామాక్షి మాటలు శంకరానికి అర్థమయ్యాయి. కామాక్షికి కూడా సోడాబుడ్డి కళ్ళద్దాలు వున్నాయి. స్నేహితురాళ్ళలో నలుగురి పేర్లు కామాక్షులే. అందుకని కళ్ళజోడు కామాక్షి అని కామాక్షికి గుర్తుగా పేరు వుంది. కామాక్షికి కళ్ళజోడు యిష్టం లేదు. గతిలేక జోడు పెట్టుకుంటున్నది. కళ్ళజోడువల్ల చాలా సంబంధాలు తప్పిపోయాయి. అందుకని పెద్దలు నయాన భయాన వప్పించి పిల్లకి కళ్ళజోడు పెట్టకుండా పెళ్ళిచేశారు. ఈ మోసం బైబపడక తప్పదుకాబట్టి కామాక్షి ఏడుస్తూ కళ్ళజోడు కథ చెప్పింది.

శంకరం అమాంతం కామాక్షిని చేతుల మీద కెత్తుకుని తెలుగుసినిమా హీరోలా గిరగిర తిప్పి ఇతగాడికి సినిమా పాటలు రాకపోయినా తన సొంత పైత్యంతో "కల నిజమాయెగా కళ్ళజోడు ఆమెగా" అంటూ పాడాడు. ఆ తర్వాత కామాక్షికి తన కథ తన కోరిక చెప్పాడు.

పద్దెనిమిది శాల్ల బంగారంతో పందిరి మంచంతో సారె చీరెతోపాటు సోడాబుడ్డి కళ్ళద్దాలతోసహా కామాక్షి కాపురానికి వచ్చింది. పరంధామయ్య ఎగిరాడుగాని తన కాళ్ళ నొప్పులు చేయటంతో గంతకు తగ్గ బొంత అని సరిపెట్టుకున్నాడు.


శంకరం కోరికంటూ తీరింది, కామాక్షికి కళ్ళజోడు వుండటం వరకే. వాళ్ళకు సంసారంలో ఎన్నికళ్ళజోళ్ళు పగిలాయి. నాలుగు కళ్ళు ఎనిమిది జోళ్ళలా సంసారం సాఫీగా సాగుతున్న వేళ కామాక్షి కడుపు పండింది. దబ్బపండులాంటి అమ్మాయి పుట్టింది. అదిమొదలు ఏడాదికో దబ్బపండు చొప్పున మూడు దబ్బపండ్లు పుట్టాయి. మగనలుసు పుట్టదా, అని కామాక్షి వాపోతున్న వేళ ఓ మగ నలుసుకూడా పుట్టాడు. భార్యకోరిక కోసం అందాకా ఆగిన శంకరం మగనలుసు భూమ్మీద పడంగానే ఆపరేషను చేయించుకున్నాడు.

తన పిల్లలకి కళ్ళజోడు రాకూడదని వెయ్యి దేముళ్ళకి మొక్కుకున్నాడు శంకరం. ఏ దేముడూ మొర వినలేదు. ఇప్పుడు శంకరం పిల్లలు స్కూలు చదువులకి వచ్చారు. అంతేకాదు ఆ నలుగురికీ కళ్ళజోడు వచ్చింది.

"ఇదెలా జరిగింది డాక్టర్. నా పిల్లల్లో వక్కరికంటే వక్కరికైనా కళ్ళజోడు లేకుండా చేయలేరా!" అంటూ శంకరం వాపోయాడు.

"ఇది మయోపియ. తల్లీ తండ్రిలో






ఏ ఒక్కరికున్నా పిల్లలకి రావచ్చు. తల్లి తండ్రిలో వకరికి మయోపియ వుండి. రెండో వారికి లేకపోతే పిల్లలకి రాకపోవచ్చు. అలా గాక తల్లి దండ్రి యిరువురికీ మయోపియ వుంటే వారికి పుట్టే పిల్లలకి తప్పక మయోపియ వస్తుంది— అసలు దాని లక్షణం...."

అంటూ డాక్టరు సవిక్షణంగా మయోపియ గురించి వివరించారు.

ఇప్పుడు శంకరానికి రెండు దిగుళ్ళు పిల్లలకు సోడాబుడ్డి కళ్ళద్దాలు జీవితాంతం పెట్టక తప్పదు. కళ్ళద్దాలు అవసరంలేని అమ్మాయిని పెళ్ళాడినట్లయితే తనకి పుట్టిన పిల్లలకి కళ్ళద్దాలు వచ్చేవి కావేమో! అద్దాలున్న అమ్మాయినే పెళ్ళాడతానని శపధం చేశాడు. తండ్రి బలవంతానికి తల వంచక తప్పలేదు. అయినా ఏమయింది. భగవంతుడు తన కోరిక నెరవేర్చాడు. భగవంతుడికెంత పక్షపాత బుద్ధి. మంచి కోరికలు నెరవేర్చడు. మనిషికి అపకారం చేసే కోరికలు నెరవేరుస్తాడు. ఇలా అనుకుంటూ శంకరం తరచు విచారించేవాడు.

శంకరం వాళ్ళ యిల్లు కావాలంటే తొందరగా ఎవరూ ఆ వీధిలో చెప్పలేరు. కళ్ళజోళ్ళవారి ఇల్లు అంటే చాలు. అదిగో నండి అల్లదే అని అందరూ చటుక్కున శంకరం ఇల్లు చూపిస్తారు.

వ్యాకర్ణంవారి వీధి. గోకర్ణం వారి వీధి లాగా పోను పోను కళ్ళద్దాల వారి వీధి అని ఆ వీధికి పేరు వచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఈ కరువు రోజుల్లో ఆరు కళ్ళజోళ్ళ అదనపు భారంతో శంకరం సంసారం లాక్కొస్తున్నాడు. పాపం శంకరం!




"కాళ్ళ గజ్జె కంకాళమ్మా
నీ కాళ్ళ జోళ్ళు ఎక్కడవమ్మా!"
"జవ్వనులంతా వాడే జోళ్ళు
జనత జోళ్ళు!"

నవ్యతకు నాణ్యతకు పెట్టింది పేరు!

జనత షూ కంపెని

H.O. హనుమాన్‌పేట, విజయవాడ-3. Ph:62832

అన్ని బ్రాంచీల సౌజన్యంతో

లతకు పందిరే అందం, మహిళకు శ్రీ ఆభరణములే అందం.




22c.t. బంగారు కవరింగ్ చేయబడినవి

ESTD.1964, Grams: SREEGOLD
PHONES: OFF: 2235 RES: 785

తయారు చేయువారు:
శ్రీ గోల్డు కవరింగ్ వర్క్సు
REGD
P.B. NO 35. శ్రీమహల్,
మచిలీపట్నం. A.P

VIJAYA/MPM

నూతన యవ్వనం పొందండి ! సంతానవంతులు కండి !



చర్మ వ్యాధుల నుండి విముక్తులు కండి !

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేకపోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసము, మేహ మచ్చలు మొ॥ సమస్త దీర్ఘవ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

క్యాంపులు:— ప్రతి ఆదివారం "భీమవరం షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 6-30 గం॥ వరకు.

ప్రతినెల 1 మరియు 16 తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి. 9 గం॥వరకు.

డాక్టరు. డి. మార్కండేయులు, ఆయుర్వేదభిషక్

పార్కు రోడ్, గుడివాడ-521 301. ఫోన్ : 622 హాస్పటల్, 640 నివాసం.